క్లుప్తంగా

ఒడిశా వెళ్లి పింఛన్ అందజేసి..



అప్పారావుకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ చిన్నారావు

సీతంపేట: ఒడిశా రాష్ట్రంలోని గుణుపూర్ సమీపంలో గల చిన్నసార అనే గ్రామానికి వెళ్లి మరీ పింఛన్ అందజేశాడు చాకలిగూడకు చెందిన వలంటీర్ సవర చిన్నారావు. గ్రామానికి చెందిన సవర అప్పారావు అనారోగ్యంతో చిన్నసారలో చికిత్స పొందుతున్నాడు. దీంతో వలంటీర్ చిన్నారావు శనివారం చిన్నసారకు వెళ్లి పింఛన్ అందజేశాడు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం



పనుకువలసలో గృహ నిర్మాణదారులకు సూచనలు చేస్తున్న ఏఈ మాధవరావు

పాలకొండ రూరల్: ఇళ్ల లబ్ధిదారులు నిర్మాణ పనులను వేగవంతం చేయాలని హౌసింగ్ ఏఈ మాధవరావు అన్నారు. మండలంలోని పనుకువలస, లుంబూరు, బుక్కూరు, తదితర గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో గృహ నిర్మాణాల తాజా స్థితిగతులపై ఆరా తీశారు. లబ్ధిదారులతో మాట్లాడుతూ.. వారికి అందుతున్న బిల్లులు, రాయితీలను అడిగి తెలుసుకున్నారు.

చిన్నారులను పనిలో పెడితే చర్యలు



తనిఖీలు చేపడుతున్న అధికారులు

సీతంపేట: పెద్దనిమిదేళ్ల లోపున్న బాల, బాలికలను పనిలో పెడితే సంబంధిత యజమానులపై కేసులు నమోదు చేస్తామని అసిస్టెంట్ లేబర్ ఇన్‌స్పెక్టర్ ఆర్‌పీ శ్రీనివాసరావు తెలిపారు. ఆపరేషన్ స్వేచ్ఛ ప్రోగ్రాం-4లో భాగంగా సీతంపేటలో వివిధ హోటళ్లు, దుకాణాల్లో శనివారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా దుకాణాల యజమానులకు కార్మిక చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో దిశ ఎస్సై లావణ్య, ఏఎస్సై బి.సంజీవ్, జూనియర్ అసిస్టెంట్ సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలందించాలి



సీడీపీఓకు గ్లాసులు, ప్లేట్లు అందిస్తున్న సూర్యనారాయణ

పాలకొండ రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు మెరుగైన సేవలు అందించాలని సీడీపీఓ సిమ్మాలమ్మ అన్నారు. మండలంలోని ఎన్‌కే రాజపురంలో గల అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డులు, మెనూ వివరాలపై ఆరా తీశారు. చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని సూచించారు. అనంతరం అదే ప్రాంతానికి చెందిన కోరాడ సూర్యనారాయణ అందించిన స్టీల్ గ్లాసులు, ప్లేట్లను చిన్నారులకు అందజేశారు.కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి.మేరి, సిబ్బంది ఎల్.జయమ్మ, అప్పలరాములమ్మ పాల్గొన్నారు.

అవగాహనతోనే కాలుష్య నివారణ



మాట్లాడుతున్న ప్రిన్స్‌పాల్ శ్యామ్‌బాబు

పాలకొండ రూరల్: అవగాహనతోనే కాలుష్య నివారణ సాధ్యమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్స్‌పాల్ ఎం.శ్యామ్‌బాబు అన్నారు. ప్రపంచ కాలుష్య నివారణ దినోత్సవం సందర్భంగా రసాయన శాస్త్ర విభాగం నేతృత్వంలో శనివారం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. ఈ క్రమంలో విద్యార్థులకు ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్స్‌పాల్ బి. జయమణి, ఉపన్యాసకులు బి.రాజు, శ్రీనివాసరావు, జగన్ మోహనరావు, ప్రశాంతి పాల్గొన్నారు.

200 లీటర్ల సారా స్వాధీనం

పాచిపెంట: కారులో అక్రమంగా తరలిస్తున్న 220 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఫక్రుద్దీన్ తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి, నిందితుడిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించామన్నారు. శనివారం ఉదయం ఒడిశా నుంచి చాపరాయవలస గ్రామానికి వస్తున్న కారులో సారా పట్టుబడిందన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోండి

- ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి



పాలకొండ:ర్యాలీలో పాల్గొన్న పీఓ కల్పనాకుమారి, తదితరులు

పాలకొండ: ప్రతి ఒక్కరూ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని సీతంపేట ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి అన్నారు. ఓటుహక్కు వినియోగంపై పట్టణంలో శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు, బీఎల్‌ఓలు పాల్గొని ఓటే వజ్రాయుధమని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ, నియోజకవర్గంలో పెద్ద ఎత్తున ఓటరు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆమెతో పాటు తహసీల్దార్ పి.సోమేశ్వరరావు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరూ ఓటు హక్కు పొందాలి..

గుమ్మలక్ష్మీపురం: అర్హులంతా తప్పనిసరిగా ఓటు హక్కు పొందాలని తహసీల్దార్ జె.రాములమ్మ అన్నారు. మండలంలోని పోలింగ్ స్టేషన్ల వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటర్ల నమోదు కేంద్రాలను శనివారం ఆమె పరిశీలించారు. లక్కగూడ పోలింగ్ కేంద్రం వద్ద ఆమె మాట్లాడుతూ, 18 సంవత్సరాలు దాటిన వారందరికీ ఓటుహక్కు కల్పించాలనే ఉద్దేశంతో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎల్విన్‌పేట సర్పంచ్ ఆర్.ఎస్ చైతన్య ప్రవంతి ఎల్విన్‌పేటలోని 76, 77 పోలింగ్ స్టేషన్లను సందర్శించి, ఓటర్ల జాబితాలను పరిశీలించారు.

ప్రత్యేక ఓటర్ల నమోదు పరిశీలన

భామిని: మండలంలోని 42 పోలింగ్ బూత్‌ల వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటర్ల నమోదు కేంద్రాలను ఎస్‌ఓలు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా



భామిని: దరఖాస్తులు పరిశీలిస్తున్న ఎస్‌ఓ తులసీదాస్

బీఎల్‌ఓలకు పలు సూచనలు చేశారు. మండల కేంద్రంలో ఆదివారం కూడా ప్రత్యేక ఓటర్ల నమోదు కేంద్రాలు అందుబాటులో ఉంటాయని తహసీల్దార్ నీలాపు అప్పారావు సూచించారు. ఎన్నికల రిటరి్నంగ్ అధికారి, పీఓ కల్పనాకుమారి ఆదేశాల మేరకు ఓటర్ల చేర్పులు, మార్పులు, తొలగింపుల దరఖాస్తు పరిశీలన కూడా కొనసాగుతుందన్నారు.

పక్కాగా ప్రత్యేక ఓటర్ల నమోదు

వీరఘట్టం: మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని పక్కాగా చేపట్టాలని తహసీల్దార్ చందక సత్యనారాయణ సూచించారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఓటర్ల నమోదుపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆదివారం కూడా ఓటర్ల నమోదు కొనసాగించాలని సిబ్బందికి సూచించారు.

సక్రమంగా విధులు..

వీరఘట్టం: బీఎల్‌ఓలు ఎన్నికల విధులను సక్రమంగా నిర్వహించాలని ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి సూచించారు. మండలంలోని పలు పోలింగ్ స్టేషన్లను ఆమె పరిశీలించారు. తలవరంలోని 280, 281, 282 పోలింగ్ కేంద్రాల్లో.. బొడ్లపాడు గ్రామంలోని 271 పోలింగ్ కేంద్రంలో బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్ నిర్లక్ష్యంగా ఉండడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరుగురు సిబ్బందికీ షోకాజ్ నోటీసులు ఇవ్వాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

సక్రమంగా పౌష్టికాహారం పంపిణీ

గరుగుబిల్లి: గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం సక్రమంగా అందించాలని ఎంపీడీఓ జి.పైడితల్లి అన్నారు. మండలంలోని రావుపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు, శిశువులు, కిశోర బాలికలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పౌష్టికాహారంపై తల్లులకు మరింత అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వా



పిల్లల బరువు చార్టును పరిశీలిస్తున్న ఎంపీడీఓ పైడితల్లి

డీ వర్కర్లు, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'వికసిత్ భారత్'

భామిని: మండలంలోని తాలాడ, ఘనసరలలో వికసిత్ భారత్ సంకల్పయాత్రలను శనివారం నిర్వహించారు. ఎంపీడీఓ జె.ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. పథకాలు అందని కొంతమంది అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో కార్యదర్శి సవర నాగేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎరుకుమజ్జి పాపినాయుడు, బీజేపీ నాయకుడు కె.తిరు



తాలాడ గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఉమామహేశ్వరి

పతిరావు, అధికారులు పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో కవలల జననం

భామిని: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 108 అంబులెన్స్‌లు ప్రమాద సమయంలోనూ, ప్రసవాల సమయంలోనూ ఆదుకుంటున్నాయి. మండలంలోని పోలవరంనకు చెందిన గర్భిణి నిమ్మల లతకు శనివారం పురిటినొప్పులు రాగా.. కుటుంబ సభ్యులు సీతంపేట ఐటీడీఏ కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో కొత్తూరు సీహెచ్‌ఎన్‌సీలో అందుబాటులో ఉన్న 108 అంబులెన్స్ పోలవరం వచ్చి గర్భిణిని ఆస్పత్రికి తీసుకెళ్తుండగా.. నొప్పులు ఎక్కువ కావడంతో సిబ్బంది ప్రసవం జరిపించగా కవల పిల్లలు పుట్టారు. వెంట



అంబులెన్స్‌లో జన్మించిన కవల పిల్లలు

నే తల్లీబిడ్డలను కొత్తూరు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం తల్లీబిడ్డలిద్దరూ ఆరోగ్యంగా ఉన్నారు.



పూజల్లో పాల్గొన్న మహిళా భక్తులు

ఘనంగా కోటదుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం

కురుపాం: మండల కేంద్రంలోని రావాడ కూడలిలో వెలసిన కోటదుర్గమ్మ ఆలయ రెండో వార్షికోత్సవం శనివారం ఘనగా నిర్వహించారు. వేకువజాము నుంచే భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు.

వినియోగదారులకు మెరుగైన సేవలు

పాలకొండ రూరల్:ప్రజలకు విద్యుత్ శాఖ సిబ్బంది అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని ఆ శాఖ డీఈఈ మోహన్‌చక్రవర్తి అన్నారు. శనివారం స్థానిక సబ్‌స్టేషన్ వద్ద సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రకృతి విపత్తులు తలెత్తితే తక్షణమే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఏఈ ఎస్.శ్యామ్‌సుందర్‌తో కలిసి పలు సూచనలు చేశారు. అనంతరం సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.



భద్రతా ప్రతిజ్ఞ చేస్తున్న ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది

'ఆడుదాం ఆంధ్రా'కు సహకరించాలి



వలంటీర్లకు అవగాహన కల్పిస్తున్న స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ జాకాబ్ దయానంద్

సీతంపేట: 'ఆడుదాం ఆంధ్రా'కు అందరూ సహకరించాలని ఎంపీడీఓ కె.గీతాంజలి, ఐటీడీఏ స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ జాకాబ్ దయానంద్ కోరారు. మండల పరిధిలోని 31 గ్రామ సచివాలయాల పరిధిలో గల వలంటీర్లకు శనివారం స్థానిక ఎంఎంఎస్ కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఇప్పటికే రిజిస్ట్రేషన్లకు విశేష స్పందన లభిస్తోందన్నారు. క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్ డబుల్స్, ఖోఖోలకు సంబంధించిన రూల్స్ వివరించారు. కార్యక్రమంలో పీడీ, పీఈటీలు పాల్గొన్నారు.

మహిళా మార్ట్‌లను సద్వినియోగం చేసుకోవాలి

సాలూరు: మహిళా మార్ట్‌లను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్ కోరారు. శనివారం స్థానిక పట్టణంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో సాలూరు, పాచిపెంట మండలాల వెలుగు ఏపీఎంలు, సీసీలు, వీవోఏలతో సమావేశమైన ఆయన ఆర్థిక స్వావలంబన దిశగా మహిళా సంఘాల సభ్యులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న రుణాల ద్వారా చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుని, ఆర్థికంగా ఎదగాలన్నారు. మహిళా



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్

మార్ట్‌లలో కూడా నాణ్యమైన సరుకులు లభ్యమవుతున్నాయన్నారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించవద్దన్నారు.

ప్రజలు ఇబ్బంది పడకుండా చర్యలు

- ఆర్డీఓ లావణ్య



వీరఘట్టంలో రేషన్ సరుకుల పంపిణీని పర్యవేక్షిస్తున్న ఆర్డీఓ లావణ్య

వీరఘట్టం: మిచాంగ్ తుఫాన్ ప్రభావం వల్ల ప్రజలు ఇబ్బందులు పడకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఆర్డీఓ లావణ్య అన్నారు. ప్రజలందరి వద్ద నిత్యావసర సరుకులు ఉండేలా రెండు రోజుల్లో లబ్ధిదారులకు అందజేస్తున్నట్లు చెప్పారు. వీరఘట్టం, తలవరం, బొడ్లపాడు గ్రామాల్లో రేషన్ సరుకుల పంపిణీని శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలుసూచనలు చేశారు.

'ఫ్యామిలీ డాక్టర్'తో ఇంటి వద్దకే వైద్యసేవలు

సీతానగరం: ప్రజారోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ఇంటి వద్దకే వైద్యసేవలు అందుతున్నాయని స్థానిక పీహెచ్‌సీ వైద్యురాలు పావని అన్నారు. మండలంలోని సూరంపేట సచివాలయం వద్ద ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య శిబిరానికి హాజరైన పలువురు గ్రామస్తులకు వైద్య సిబ్బంది ఆరోగ్య తనిఖీలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



లారీతో ధాన్యం తరలించేందుకు జెండా ఊపుతున్న ఎంపీపీ దమలపాటి వెంకటరమణ నాయుడు, ఏఓ సౌజన్య, తదితరులు

వీరఘట్టం: తుఫాన్ నేపథ్యంలో రైతులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసింది. మండలంలోని తెట్టంగిలో రైతుల వద్ద ఉన్న 32 టన్నుల ధాన్యంను రైతుభరోసా కేంద్రం ద్వారా వ్యవసాయ శాఖ అధికారులు శనివారం కొనుగోలు చేశారు. ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు ధాన్యం కొనుగోలును జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రైతులు పండించిన ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఏఓ జె. సౌమ్య, పాలకొండ ఏఎంసీ వైస్ చైర్మన్ పొట్నూరు లక్ష్మణరావు, సర్పంచ్ అలజంగి విజయమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు సతివాడ వరలక్ష్మి, ఉప సర్పంచ్ పొట్నూరు పరిశినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో విపత్తును అధిగమించాలి

- ఎంపీడీఓ త్రినాథులు



కొండాపురంలో సచివాలయ సిబ్బంది, ప్రజలతో సమావేశమైన ఎంపీడీఓ

పాలకొండ రూరల్: తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో మండల స్థాయి, సచివాలయ అధికారులు సమన్వయంతో వ్యవహరించి విపత్తును అధిగమించాలని ఎంపీడీఓ డొంక త్రినాథులు అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశమై, తుఫాన్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ సహాయకులు, అడ్మిన్ సెక్రటరీలు పాల్గొన్నారు. అనంతరం కొండాపురం, లుంబూరు గ్రామ సచివాలయాలను సందర్శించారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి



గరుగుబిల్లి: ఉద్దవోలులో రైతులతో మాట్లాడుతున్న ఆర్‌డీఓ హేమలత

గరుగుబిల్లి: తుఫాన్ నేపథ్యంలో రైతులందరూ అప్రమత్తంగా ఉండాలని పార్వతీపురం రెవెన్యూ డివిజనల్ అధికారి కె.హేమలత సూచించారు. మండలంలోని ఉద్దవోలు గ్రామంలో శనివారం పర్యటించి రైతులకు పలు సూచనలు చేశారు. తుఫాన్ ప్రభావం తగ్గేంతవరకు వరి కోతలు చేయవద్దన్నారు. ఇప్పటికే కోసిన వరిపంటను పంట పొలాలలోనే కుప్పలుగా వేసుకోవాలని సూచించారు. ధాన్యాన్ని నేరుగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలన్నారు. కార్యక్రమంలో ఏఓ ఆర్.విజయభారతి, తదితరులున్నారు.

రైతు గుండెల్లో తుఫాన్ దడ

వీరఘట్టం: మరో రెండు రోజుల్లో మిచాంగ్ తుఫాన్ ప్రభావం జిల్లాపై ఉంటుందని అధికారులు ప్రకటించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా వరి పంట సాగు చేస్తున్న రైతులకు కంటిమీద కునుకు లేకుండా పోయింది. కొద్ది రోజుల కిందటే వరి కోతలు పూర్తి చేసి కుప్పలు పెట్టారు. తుఫాన్ ప్రభావంతో వర్షాలు పడితే కుప్పలు తడిసిపోతే తమ పరిస్థితి ఏమిటని తలలు పట్టుకుంటున్నారు. కుప్పలు తడవకుండా ఏర్పాట్లు చేసుకోవ



నడుకూరు వద్ద పొలంలో వరి కుప్పలు

డంలో బిజీగా ఉన్నారు.

రైతులు అవగాహనతో మెలగాలి

పాలకొండ రూరల్: తుఫాన్ ప్రభావంతో రైతులు అవగాహనతో మెలగాలని వ్యవసాయశాఖ ఏఓ ఎన్ని వాహిని సూచించారు. వరి కోతలు, ధాన్యం నిల్వల భద్రతపై శనివారం రైతులకు సూచనలు అందించారు. ముఖ్యంగా 3, 4, 5 తేదీల్లో కనీసం 40 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నట్లు వాతావరణ శాఖ స్పష్టం చేసిందన్నారు. వరి కోతలు వాయిదా వేయాలన్నారు.

రైలుబస్సు పునరుద్ధరించాలి

- డిప్యూటీ సీఎం రాజన్నదొరను కలిసిన వైఎస్సార్ సీపీ నాయకులు

సాలూరు: సాలూరు-బొబ్బిలి రైలుబస్సు పునరుద్ధరించాలని వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీకాంత్, అనిల్‌కుమార్, రామకృష్ణ, తవిటినాయుడు కోరుతున్నారు. ఇదే విషయమై వారంతా స్థానిక పట్టణంలో డిప్యూటీ సీఎం, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొరను ఆయన నివాసంలోనే శనివారం కలిసి, వినతిపత్రం అందజేశారు. అనంతరం రైలుబస్సు నడపడం ద్వారా ఇరుప్రాంతాలకు కలిగే ప్రయోజనాలను వివరించారు. అలాగే ప్రస్తుతం కొత్తగా విశాఖపట్నం నుంచి సాలూరుకు నడపాలనుకుంటున్న రైలు ప్రయాణాల్లో కూడా స్వల్ప మార్పులు తీసుకోవాలని విన్నవించారు. వేకువజామున 4 గంటలకు విశాఖపట్నానికి సదరు రైలు నడపడం ద్వారా ఈ ప్రాంత ప్రజలు ఆ రైలు సేవలను సద్వినియోగం చేసుకోలేకపోవచ్చని, ప్రజల ప్రయాణానికి అనువైన సమయంలో రైలు నడిపేలా చర్యలు తీసుకోవాలన్నారు. సాలూరు-దండిగాం రోడ్డు సమీపంలోని రైల్వేలైన్ వరకు రైలు వచ్చేలా చొరవ తీసుకోవాలని వినతించారు. సమస్య పరిష్కారానికి డిప్యూటీ సీఎం సానుకూలంగా స్పందించినట్లు సదరు నేతలు తెలిపారు.

అటవీ శాఖ అనుమతులు..

అంతకుముందు విలేకరులతో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ శుక్రవారం తనను మర్యాదపూర్వకంగా కలిసిన డీఎఫ్‌వో ప్రసూన దృష్టికి గిరిశిఖర గ్రామాల రోడ్ల కష్టాలు వివరించానన్నారు. గిరిశిఖర గ్రామాల్లో రోడ్లు వేసేందుకు అనుమతులు మంజూరు చేయాలని కోరిన వెంటనే మానవతా హృదయంతో స్పందించి, అటవీ శాఖ అనుమతులు మంజూరు చేసిందని, ఈ మేరకు పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల డీఎఫ్‌వోలకు గిరిజనుల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపానన్నారు. మండలంలోని దిగువశెంబి నుంచి డిప్పలపాడు మీదుగా తోణాం రోడ్డు, రొడ్డవలస జంక్షన్ నుంచి కంకణాపల్లి రోడ్డులకు అటవీ శాఖ అనుమతులు వచ్చాయన్నారు.



డిప్యూటీ సీఎం రాజన్నదొరకు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

100 శాతం నిర్మాణాలు..

ఇదిలా ఉండగా, శనివారం ఆయనను కలిసిన మున్సిపల్ కమిషనర్ జయరాం, హౌసింగ్ డీఈ సోమేశ్వరరావు, ఏఈ శ్రీనివాసరావులకు డిప్యూటీ సీఎం పలు సూచనలు చేశారు. జగనన్న కాలనీ గృహ నిర్మాణాలను వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించిన ఆయన 2024 జనవరి 31వ తేదీలోగా 100 శాతం నిర్మాణాలు పూర్తయ్యేలా చొరవ తీసుకోవాలని తెలిపారు.

ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దండి

సాలూరు: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని ఐటీడీఏ పీవో విష్ణుచరణ్ సూచించారు. శనివారం మండలంలోని కొత్తవలస గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించిన ఆయన పాఠశాల రికార్డులతో పాటు విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, విద్యాబోధన, మధ్యాహ్న భోజనం వంటకాలను పరిశీలించి, పలు సూచనలు చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని, చదువులో వెనకబడిన విద్యార్థుల విద్యాప్రగతిపై ప్రత్యేక దృష్టిసారించాలని సిబ్బందికి తెలిపారు. పాఠశాల ఆవరణలో ఇంకుడుగుంతలు నిర్మించాలని ఆదేశించారు. మౌలిక సదుపాయాలు మెరుగుపరిచేందుకు నిధులు మంజూరు చేస్తామన్నారు. చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించేలా ప్రోత్సహించాలన్నారు. అనంతరం విద్యార్థులు పరీక్షలు రాస్తున్న తీరును పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంధ్యారాణి, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులు పరీక్షలు రాస్తున్న తీరును పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో విష్ణుచరణ్